క్లుప్తంగా

మంచి మార్కులతో పాసవ్వాలి



తల్లిదండ్రుల దీవెనలందుకుంటున్న ఇంటర్మీడియెట్ విద్యార్థినులు

వెల్దుర్తి: తల్లిదండ్రుల దీవెనలతో రానున్న ఫైనల్ పరీక్షలలో మంచి మార్కులతో పాసవ్వాలని స్థానిక బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసూన సూచించారు. ఆదివారం గురుకులంలో ఇంటర్మీడియట్ విద్యార్థినుల తల్లిదండ్రులతో 'కన్నవారి దీవెనలు' కార్యక్రమం నిర్వహించారు. చదువు చెప్పిన అధ్యాపకులకు, కళాశాలకు మంచి పేరు తెచ్చేలా అత్యధిక మార్కులు సాధించాలని తల్లిదండ్రులు పిల్లలను ఆశీర్వదించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం



ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేస్తున్న హిందూ జ్ఞానవేదిక కమిటీ ప్రతినిధులు

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో హిందూ జ్ఞానవేదిక ధర్మవరం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత త్రైత సిద్ధాంత ప్రచారం జరిగింది. కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. మానవుడు త్రైత సిద్ధాంత భగవద్గీత చదివి ఆచరించడం ద్వారా సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానం పొందగలడన్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన వంద రకాల ఆధ్యాత్మిక గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు మద్దిలేటి, పరశురాముడు, రంగస్వామి, సుధాకర్ నాయుడు, రాజశేఖర్, వెంకట్, మనోహర్, బలరాముడు, లక్ష్మి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని శ్మశాన వాటికకు తరలిస్తున్న యువ స్పందన సొసైటీ సభ్యులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా ఉంటూ ఆదివారం మృతి చెందిన ఓ అనాథ శవానికి సర్పంచ్ నాగప్ప, యువ స్పందన సొసైటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. ఉదయాన్నే అనాథ మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు తాండ హనుమంతు, భీమన్న, అంజినేయులు, రాముడు, నాగరాజు అక్కడికి చేరుకుని పాడెకట్టి శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా ఇస్తెమా

కృష్ణగిరి: మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లెలో ముస్లింలు ఆదివారం ఇస్తెమాను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన మత పెద్ద గోకారి సాహెబ్ ప్రబోధిస్తూ.. ముస్లిలందరూ అల్లా మార్గంలో నడిచి సన్మార్గులై ఆయన కృప పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ నమాజ్ పాటిస్తూ సోదరభావంతో మెలగాలన్నారు. అందరు బాగుండాలని కోరుతూ దువా చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముస్లింలకు స్థానికులు కాలేసాహెబ్, మదార్‌సాహెబ్, మైదాన్, బషీర్, అల్లీసాహెబ్ తదితరులు ఏర్పాట్లు చేశారు.

15 నుంచి క్రికెట్ టోర్నీ

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 15 నుంచి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు లోకేష్, విజయుడు, శేఖర్ తదితరులు ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు వరుసగా రూ.25 వేలు, రూ.10,016, రూ.5,016లను దాతల సహకారంతో అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాజట్లు 14వ తేదీ సాయంత్రంలోగా రూ.600 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 94936 86207, 75696 83388 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో వెలిసిన మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

గడ్డివామి దగ్ధం

పత్తికొండ రూరల్: పులికొండ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివామి దగ్ధమైంది. మద్దిలేటి అనే రైతుకు చెందిన గడ్డివామికి నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు పత్తికొండ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు పక్కనున్న వాటికి వ్యాపించకుండా అదుపుచేశారు. అగ్ని ప్రమాదంలో రూ.30 వేలు విలువైన పశుగ్రాసం దగ్ధమైనట్లు బాధితుడు వాపోయారు.

మండలి పోరుకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- ఎమ్మిగనూరులో పట్టభద్ర ఓటర్లకు 4, టీచర్లకు 1 పోలింగ్ కేంద్రం ఏర్పాటు





నందవరంలో ఎన్నికల అధికారులతో తహసీల్దార్ నిత్యానందరాజు, ఎస్‌ఐ మహేష్‌కుమార్, సామగ్రితో కృష్ణగిరి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

ఆలూరు రూరల్: పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం జరుగనున్న ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పత్తికొండ డివిజన్‌లోని 9 మండలాల్లో ప్రతి మండల కేంద్రంలో రెండు పోలీంగ్ బూత్‌లు సిద్ధం చేశారు. ఒక్కో బూత్‌లో పీఓ, ఇద్దరు ఏపీఓలతో పాటు మరో ఇద్దరు సహాయ సిబ్బందిని నియమించారు.. పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉంచారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీల ఎన్నిక పోలీంగ్ కేంద్రాన్ని పత్తికొండలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. పత్తికొండ డివిజన్‌లో 9,385 మంది పట్టభద్రల ఓటర్లు, 430 మంది ఉపాధ్యాయ ఓటర్లు అలాగే డివిజన్‌లో 9 మంది జెడ్పీటీసీలు, 136 మంది ఎంపీటీసీలు నేడు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ఆలూరు ప్రభుత్వ బాలుర-2 పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పత్తికొండ డివిజన్ ఎలక్షన్ అబ్జర్వర్ వంశీ కృష్ణ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పట్టభద్ర ఓటర్లు 5,393 మంది ఉండగా వారిలో 3,756 మంది పురుషులు, 1,637 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల ఎన్నికకు వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా 1,403 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ఎంఎస్ బాలికల హైస్కూల్‌లోని ఒక పోలింగ్ కేంద్రంలో 1,341 మంది, మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 2,649 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 600 మంది టీచర్ ఓటర్లు ఓట్లు వేయాల్సి ఉంది. ఆయా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకుగాను ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు, సిబ్బంది బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేసుకున్నారు.

నందవరం: స్థానిక ఎంపీపీ (స్పెషల్) స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ నిత్యానందరాజు, ఎస్‌ఐ మహేష్‌కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. కేంద్రాలలో సీసీ కెమెరాలు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు, బ్రాడ్ కాస్టింగ్ వంటి వసతులు కల్పించామన్నారు. మండలంలో 1,060 మంది పట్టభద్రులు, 22 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వీరి కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు 8 మంది అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. బ్రాడ్ కాస్టింగ్ అధికారులు, రూట్ ఆఫీసర్ సుధాకర్‌తో పాటు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలో సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు 1,516 మంది, ఉపాధ్యాయులు 46 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. గోనెగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పట్టభద్రులకు 2, ఉపాధ్యాయులకు 1 పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కృష్ణగిరి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం పరిశీలించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించి రెండు బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో 829 మంది పట్టభద్రులు, 9 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఓటరుకే తమ ఫొటో గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు వేయాలన్నారు.

హొళగుంద: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులకు, టీచర్స్‌కు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 528 గ్రాడ్యుయేట్ ఓటర్లు, 6 టీచర్ ఓటర్లు ఉన్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఓటర్లు తప్పని సరిగా తమ గుర్తింపు కార్డులు, పత్రాలను వెంట తీసుకెళ్లాలని ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్, ఎన్నికల జోనల్ ఆఫీసర్ కోనేటి లక్ష్మి నారాయణ సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



హొళగుందలో బ్యాలెట్ బాక్స్‌లను తీసుకొస్తున్న ఎన్నికల సిబ్బంది

చిప్పగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏ, బీ బ్లాక్‌లుగా ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు లక్ష్మినారాయణ వెల్లడించారు. ఇక్కడ 452 మంది పట్టభద్ర ఓటర్లు, 13 మంది ఉపాధాయ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

వెల్దుర్తి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలో సోమవారం జరుగనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఎన్నికల అధికారులు స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 9ఏ సెక్షన్ తరగతి గది, టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి పదో తరగతి గదిని కేటాయించారు. ఆదివారం సాయంత్రం జోనల్ ఆఫీసర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ తదితర సిబ్బంది తమ బ్యాలెట్ బాక్సులతో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక ఏఈఆర్‌ఓ/తహసీల్దార్ రాజేశ్వరి, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి పోలింగ్ కేంద్రంలో సదుపాయాలను పర్యవేక్షించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పట్టభద్రులు 1258 మంది, టీచర్లు 21 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. ఓటరు స్లిప్ అందనివారు పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్ద తమ ధ్రువీకరణ పత్రం చూపి పొందవచ్చన్నారు. ఓటు వేసేందుకు సైతం ఆధార్, పాన్, రేషన్ కార్డు తదితర ఏదైనా ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాలన్నారు. ఓటింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్, ఎస్‌ఐ తెలిపారు.



వెల్దుర్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఈఆర్‌ఓ, ఎస్‌ఐ

వైభవంగా వసంతోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, పల్లకీ సేవ, వసంతోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీరంగనాథ స్వామిని పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా వెళ్లి స్థానిక స్వామి వారి బావి వద్ద వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి హంస వాహనంపై కొలువుంచారు. ఆలయ ఆవరణలో పల్లకీ సేవ చేశారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

18న హుండీ ఆదాయం లెక్కింపు

పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలోని శాశ్వత హుండీ, తాత్కాలిక హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఈనెల 18వతేదీ ఉదయం 10 గంటల నుంచి చేపట్టనున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ నిబంధనల మేరకు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే వారు లుంగీ, కండువా ధరించి రావాలన్నారు.

శ్రీశైలానికి కన్నడిగుల పాదయాత్ర

నందవరం: ఉగాది వేడుకలను పురస్కరించుకుని కర్ణాటక భక్తులు వేలాదిగా కాలినడకన శ్రీశైలానికి తరలివెళుతున్నారు. మండలంలోని మాచాపురం, నందవరం, కనకవీడు, పొనకలదిన్నె మీదుగా భక్తులు పాదయాత్ర చేస్తున్నారు. పాదయాత్రికుల కోసం నందవరంలో స్థానికులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎండలోనూ భక్తులు పాదయాత్ర సాగిస్తున్నారు. వారికి ఊరూరా స్థానికులు అన్నపానీయాలు అందజేస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు.

హొళగుంద: చిన్నహ్యాటతోపాటు హొళగుంద నుంచి ఆదివారం శివభక్తులు, భక్తులు శ్రీశైలానికి పెద్దఎత్తున పాదయాత్ర చేపట్టారు. హొళగుందకు చెందిన భక్తులు వందల సంఖ్యలో మల్లేశ్వరుని నామస్మరణంతో ఆదివారం తెల్లవారుజామున శ్రీశైల మల్లన్న దర్శనానికి పాదయాత్రగా తరలివెళ్లారు. ప్రతి ఏడాది ఉగాదిని పురస్కరించుకొని భక్తితో పాదయాత్ర చేపడ్తున్నామని వారు తెలిపారు. అదేవిధంగా ఇరుముడిలతో శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములకు గ్రామస్తులు మేళతాళాలతో పొలిమేర వద్దకు వచ్చి సాగనంపారు. హొళగుంద నుంచి ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాల మీదుగా శ్రీశైలానికి చేరుకుంటామని భక్తులు తెలిపారు.



శ్రీశైలానికి తరలివెళ్తున్న కన్నడ భక్తులు

22 నుంచి మహిళా కబడ్డీ పోటీలు

పత్తికొండటౌన్: తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామంలో ఈనెల 22వ తేదీ నుంచి జాతీయస్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఊటకంటి అమర్‌నాథ్‌రెడ్డి, రాతన ఉమామహేశ్వర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఎద్దులదొడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం కబడ్డీ పోటీల కరపత్రాలను పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కబడ్డీ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ చైర్మన్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పోటీలను ప్రారంభిస్తారన్నారు. విజేత జట్లకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ..40 వేలు చొప్పున అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 77802 48219, 99660 65752 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

- కార్యకర్తల సంబరాలు
- సేవాదల్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



పత్తికొండలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ నాయకులు

పత్తికొండటౌన్: ప్రజల పక్షాన నిలిచే పార్టీ 'వైఎస్సార్‌సీపీ' అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నియోజకవర్గంలోని 5 మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటైన వైఎస్సార్‌సీపీ గత 12 ఏళ్లుగా నిత్యం ప్రజల పక్షాన నిలిచి వారి ఆదరణతో ముందుకు సాగుతోందన్నారు. దివంగత మహానేత, డాక్టర్ వైఎస్సార్ ఆశయాల సాధనే ధ్యేయంగా ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్ విజయమ్మతో మొదలై ప్రజాభిమానంతో అంచలంచెలుగా ఎదిగి తిరుగులేని రాజకీయశక్తిగా అవతరించిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌కృష్ణ, నాయకులు కారం నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాములు, రహిమాన్, అంజినయ్య, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాసం వద్ద పార్టీ జెండాను సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ మరణాంతరం ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి జనాభిమానంతో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర చరిత్రలోనే 151 అసెంబ్లీ సీట్లతో కనీవినీ ఎరగని రీతిలో అఖండ విజయం సాధించి జనరంజక పాలన సాగిస్తోందన్నారు. జగనన్న స్ఫూర్తితో పార్టీ కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి యుకె వీరేంద్ర, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణగిరి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని పార్టీ మండల యూత్ కన్వీనర్ ఆర్.లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా చుంచుఎర్రగుడి గ్రామంలో ఆదివారం ఆయన కురుబ సంఘం రాష్ట్ర డైరెక్టర్ సుకన్య, నాయకులతో కలిసి జెండాను ఎగురవేసి అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

హొళగుంద: వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, ఎస్కే గిరి, కెంచప్ప తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

మద్దికెర: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, పంచాయతీసలహాదారు ఆంజనేయులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: సేవాదళ్ సంస్థ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మహిళలకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 10 మంది మహిళలకు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళీధర్‌రెడ్డి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఎంపీటీసీలు అనిత, సరోజ, దేవరింటి లక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



పత్తికొండలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న పి.మురళీధర్‌రెడ్డి



మద్దికెరలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఈ అద్దెలు ఎవరి ఖాతాకో..?

- రోడ్డు పక్కన యథేచ్ఛగా బంకుల ఏర్పాటు
- గుట్టుచప్పుడు కాకుండా అనధికార వసూళ్లు
- రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్న పంచాయతీ




హైస్కూల్ కాంపౌండ్ వాల్ ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్ల వ్యాపార పరంగా రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. దీంతో స్థలాలకు డిమాండ్ పెరిగింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే అక్కడ బంకు ఏర్పాటయిపోతోంది. దానికి ఆగమేఘాల మీద విద్యుత్ కనెక్షన్ కూడా వచ్చేస్తుంది. క్రమంగా శాశ్వత నిర్మాణాలు పూర్తవుతాయి. బంకు ఏర్పాటు చేసుకునే వారి నుంచి కొందరు నాయకులు మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యాపార దుకాణం ఏర్పాటు చేసుకునే వారు పంచాయతీకి ఏడాది కాలానికి ఎన్‌ఫ్రోచ్‌మెంట్ ఫీజు చెల్లించాలి. అయితే ఈ ఫీజును కొందరు అక్రమంగా వసూలు చేసుకుంటున్నారు. మండలంలోని ప్రభుత్వ స్థలాల్లో తోపుడు బండ్లు, తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుని సాయంత్రానికి వెళ్లిపోయే వాళ్లను గమనిస్తుంటాం. వారి నుంచి జాకత్‌ను కాంట్రాక్టర్ వసూలు చేసుకుంటారు. దీని పరిమితి ఏడాది వరకు ఉంటుంది. వీరివల్ల ఎవరికీ నష్టం లేదు. కొందరు ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత ప్రాతిపదికన బంకులు ఏర్పాటు చేసుకుని దర్జాగా వ్యాపారాలు చేస్తున్నారు. పంచాయతీకి ఏడాదికి లైసెన్స్ ఫీజు కింద రూ.350 చెల్లిస్తున్నారు. అయితే అక్రమంగా వ్యాపార దుకాణాల ఏర్పాటు, అడ్డగోలు మామూళ్ల వసూలు కారణంగా రోడ్డు మీద ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా పంచాతీయకి రూ.లక్షల్లో నష్టం కలుగుతోంది. ఇదిలా ఉండగా కొంతమంది భూ ఆక్రమణదారులు బంకులను ఏర్పాటు చేసి అద్దెకు కూడా ఇస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ స్థలంలో తాత్కాలిక పద్ధతిలో తప్ప శాశ్వతంగా బంకులు పెట్టుకునేందుకు ఎవ్వరికీ అనుమతులు ఉండవు. గోనెగండ్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎమ్మిగనూరు- కర్నూలు ప్రధాన రహదారి పక్కన 20 నుంచి 30 బంకులు ఏర్పాటు చేశారు. గతంలో మాజీ జడ్జీ మహమ్మద్ ఇక్బాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాల ముందు మురుగునీరు పారుతుండటంతో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేసిన బంకులను తొలగించి పంచాయతీ అధికారులతో పాఠశాల కంపౌండ్ వాల్‌కు అనుకొని డ్రైనేజీని ఏర్పాటు చేయించారు. దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో అక్రమణదారులు డ్రైనేజీపైన మళ్లీ బంకులు ఏర్పాటు చేశారు. ఈ మార్గం నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రోడ్డును ఆక్రమించి బంకులు ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆక్రమణదారులు బంకులు ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండడంతో కొందరు ఆదాయ వనరుగా మార్చుకుని లక్షలు సంపాదిస్తున్నారు.

అద్దె వసూలు చేయాలి

బంకుల నుంచి ఏడాదికి ఎన్‌ఫ్రోచ్‌మెంట్ ఫీజు కాకుండా, ఆక్రమించిన స్థలం, ఏరియా, వ్యాపార స్వభావాన్ని బట్టి నెల బాడుగ నిర్ణయించాలని స్థానికులు సూచిస్తున్నారు. తద్వారా పంచాయతీకి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అంతేగాక దీని వెనుక ఉండే మధ్యవర్తులకు చెక్ పెట్టవచ్చని చెబుతున్నారు.

అనుమతుల్లేకుండా బంకులు ఏర్పాటు చేస్తే చర్యలు



పంచాయతీ అనుమతి లేకుండా ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో బంకులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంపౌండ్‌కు అనుకొని వేసుకున్న దుకాణాలు ఆర్‌అండ్‌బీకి సంబంధించిన స్థలాల్లో ఉన్నాయి. అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవు.

– నాగేష్, ఈఓఆర్డీ, గోనెగండ్ల

గ్రామాల్లో తాగునీటి సమస్య

గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు బైలుప్పల, హెచ్.కైరవాడి గ్రామాల్లో రోజు రోజుకు తాగునీటి సమస్య తీవ్రం అవుతుంది. వేసవి కాలం ఆరంభంలోనే తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఈ గ్రామాలకు గోనెగండ్లలో ఎస్ఎస్ ట్యాంక్ నుంచి నీరు సరఫరా అవుతుంది. ట్యాంక్‌లో నీరు ఉన్నప్పటికీ సక్రమంగా సరఫరా జరగడం లేదు. నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే హెచ్.కైరవాడి గ్రామానికి హంద్రీ నది నుంచి తాగునీటి పథకాల ద్వారా నీరు సరఫరా అవుతుంది. అయితే హంద్రీ నుంచి ఇసుకాసురులు విచ్చలవిడిగా ఇసుకను తరలించడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో నీటి పథకాల మోటార్లకు నీరు అందడం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా ఉండాలంటే ఇసుక అక్రమ తరలింపునకు అధికారులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే బైలుప్పల గ్రామంలో అరకొరగా నీరు వదలడంతో దిగువ ప్రాంతాలకు సరిపోతున్నాయని, ఎగువ ప్రాంతాల్లో ఉన్న వారికి నీరు సరఫరా కావడం లేదు. వేసవి కాలంలో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.